'జీహెచ్ఎంసీ అధికారుల అక్రమాలపై విచారణ జరిపించండి'



బాధితుడితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న రాపోలు భాస్కర్

సైదాబాద్: అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కైన జీహెచ్ఎంసీ అధికారులపై విచారణ చేపట్టాలని కోరుతూ న్యాయవాది రాపోలు భాస్కర్ ఆదివారం ఏసీబీ డీజీపీకి మెయిల్ ద్వారా వినతి పత్రం పంపించారు. అనంతరం సైదాబాద్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితుడితో కలిసి మాట్లాడారు. పీఅండ్‌టీ కాలనీలో నివసించే జలిగం నర్సింగరావుకు వారసత్వంగా వచ్చిన ఉమ్మడి ఆస్తిని అతనికి తెలియకుండా సోదరుడి కుటుంబం విక్రయించిందన్నారు. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని అయినా ఎల్‌బీనగర్ జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతో అక్కడ కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అహ్మద్ ఖాద్రీ, ఏఆర్‌ఓ పంకజ

ఎల్‌బీనగర్: ఈ నెల 4న మల్కాజిగిరి పార్లమెంట్ ఎల్‌బీనగర్ సెగ్మెంట్ ఓట్ల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎల్‌బీనగర్ సెగ్మెంట్ ఏఆర్‌ఓ పంకజ తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో లెక్కింపు కేంద్రాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్‌కు మూడంచెల భద్రత ఉంటుందన్నారు. సెగ్మెంట్లో మొత్తం 571 బూత్‌లు ఉండగా ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, అబ్జర్వర్ ఉంటారని, 21 రౌండ్లలో ఓట్ల లెక్కిపు పూర్తవుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ హాల్‌లో 24 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే ఓట్ల లెక్కింపు సిబ్బందికి రెండుసార్లు శిక్షణ ఇచ్చామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని పేర్కొన్నారు. లెక్కింపు ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకుడు అహ్మద్ ఖాద్రీ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు



బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగిని సత్కరిస్తున్న రిటైర్డు జడ్జి చంద్రకుమార్

హస్తినాపురం: కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని హైకోర్టు రిటైర్డు జడ్జి చంద్రకుమార్ అన్నారు. ప్రపంచ టెలికాం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో సాగర్ రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్ఎన్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన జీ.వెంకటేశ్వర్లును ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ యుగంలో ఉన్నామని, టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు లేకుంటే జీవితం ఎలా ఉండేదో ఊహించడం కష్టమన్నారు. రైతులు కూడా సమాచార పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం శుభపరిణామని పేర్కొన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీవీఎస్ కిరణ్, బీఎస్ఎన్ఎల్ మాజీ అధికారులు రమేశ్‌బాబు, శరణ్యాచార్యులు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



హయత్‌నగర్‌లోని క్రీడా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మన్సూరాబాద్: కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌లోని మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం కార్మికులు చేపట్టిన ధర్నా ఆదివారం నాలుగో రోజుకు చేరింది. ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, ఆర్థిక సంవత్సరంలో 30 రోజులు పనిచేసిన కార్మికులకు 8.33బోనస్ ఇవ్వాలని చట్టం చెబుతున్న క్రీడా యాజమాన్యం పెడచెవిన పెడుతుందని మండిపడ్డారు. రోజుకు రూ.409 వేతనంతో కార్మికుల శ్రమను దోపిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లు పూర్తయిన కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, శ్రీకాంత్, రాజేశ్, సత్తయ్య, శివలీల, రాధ, సునీత, సావిత్రీ, శైలజ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘం వార్షికోత్సవం



వార్షిక మహాసభలో పాల్గొన్న నేతలు

షాద్‌నగర్‌: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పరస్పర సహకార పొదుపు సంఘం 19వ వార్షిక మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన ఈ సంఘంలో సభ్యులందరు ఆర్థిక క్రమశిక్షణను అవలంభించడం హర్షణీయమన్నారు. ఆర్థిక అవసరాల కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయించి ఇబ్బందులు పడేకుండా, ప్రతి నెల కొంత మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారన్నారు. ఈ సొమ్మును తమ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికబద్ధంగా ఉపయోగించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మస్న రవికుమార్, 18వ వార్డు కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కొంపల్లి తిరుపతయ్య, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భీమనపల్లి వెంకటేశ్, కోశాధికారి శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు పల్లాటి సంగీత, గుద్దేటి భిక్షపతి, పున్న విష్ణు, ఆంజనేయులు, పాలాది శ్రీనివాస్, నామని కృష్ణ, పుష్పాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ ఉన్నత పాఠశాలలో ఓరియంటేషన్ తరగతులు



పూజలు చేస్తున్న కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు

చంపాపేట: పిల్లలతో స్నేహంగా ఉంటూ వారు చెప్పే ప్రతీ సమస్య, విషయాన్ని శ్రద్ధగా వింటూ వారిలో ధైర్యాన్ని నింపేందుకు కృషి చేయాల్సిన బాధ్యత చిన్నారుల తల్లిదండ్రులపై ఉందని బాలల వ్యక్తిత్వ వికాస నిపుణులు, విశ్రాంత ఉపాధ్యాయులు లెక్కల కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ సరస్వతీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఓరియంటేషన్ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలల వ్యక్తిత్వ వికాస నిపుణుడు, విశ్రాంత ఉపాధ్యాయులు లెక్కల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులతో కలిసి సరస్వతీ మాతాకు పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల ప్రవర్తన, చదువు, ఏకాగ్రత, క్రమశిక్షణ వంటి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చిన్నారులకు ఆసక్తి, పట్టు ఉన్న సబ్జెక్ట్‌లపై ప్రోత్సహించాల్సిన బాధ్యత పేరెంట్స్‌పై ఉందన్నారు. చిన్నతనంలోనే సెల్‌ఫోన్, బైక్ వంటి సౌకర్యాలు కల్పిస్తే వ్యసనాలకు బానిసలవుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రతిరోజు కనీసం గంట పాటు గడిపి నైతిక విలువలతో పాటు పెద్దలు, ఉపాధ్యాయులను గౌరవించేలా ఉపదేశించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహ, బీనా, అవీనా, గీతాంజలి, అనిత పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



చైతన్యపురిలో రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

జాతీయ జెండాను ఆవిష్కరించిన నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎల్బీనగర్, మలక్‌పేట్ నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పలువురు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు, తెలంగాణ సంస్కృతి, పండుగలు తదితర అంశాలను వివరించారు. తెలంగాణ అమరవీరులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

–ఎల్బీనగర్, మలక్‌పేట్ జోన్ బృందం



ఎల్‌బీనగర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ పంకజ



ఎల్‌బీనగర్‌లోని కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



శంకేశ్వరబజార్ వద్ద వేడుకల్లో సుభాష్‌చందర్జీ, లింగాల హరిగౌడ్



చంపాపేట చౌరస్తాలో ఉద్యమకారులు రాము-లక్ష్మణ్



కొవ్వొత్తుల ప్రదర్శనలో బీఆర్ఎస్ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి



ఉద్యమకారులను సన్మానిస్తున్న టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్



శాలివాహననగర్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి



వనస్థలిపురం రవీంద్రభారతీ పాఠశాలలో జెండావిష్కరణలో పాల్గొన్న టీచర్లు



ఐఎస్‌సదన్‌లో జెండా ఎగురవేసిన కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి



చంపాపేట ఓల్డ్‌విలేజ్‌లో కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాట లోకల్ 23, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 17, క్యారెట్ 40. దొండ 18, ఆలు 31, ఉల్లి 27, గోకర 45, దోస 23, సొర 11, పొట్ల 15, అరటి 11, చిక్కుడు 75, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 65, బీట్‌రూట్ 65, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 45. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

స్టీరింగ్ కమిటీ సమావేశం

వనస్థలిపురం: వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం స్టీరింగ్ కమిటీ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా మార్పులు, చేర్పులు చేసిన బైలాస్‌ను రిజిస్ట్రర్ చేయించడం, అనంతరం నూతన బైలాస్ ప్రకారం కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రస్తుత స్టీరింగ్ కమిటీని రద్దు చేయడంపై ఏకగ్రీవంగా తీర్మానించారు. బైలాస్ రిజిస్ట్రేషన్ బాధ్యతలను మాజీ ప్రధాన కార్యదర్శి కే.సంజయ్‌కుమార్‌కు అప్పగించడంతో పాటు ఆయనకు సహాయకులుగా నర్సింహారాజు, కొండాచారిని నియమించారు. కార్యక్రమంలో కే.లక్ష్మయ్య, కే.శాంతప్ప, డా.నంద కుమార్, మహాదేవ్, జగదీశ్‌కుమార్, డా.ప్రభాకర్, అశోక్‌కుమార్, అనూప్ కుమార్, అంజన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత మృతి



యాదయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో నివసించే సీపీఐ సీనియర్ నాయకుడు ఆదిమల్ల యాదయ్య ఆదివారం మృతి చెందాడు. ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ యాదయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా ఆయన స్వస్థలం నల్గొండ జిల్లా గౌరారం వద్ద ఉన్న హరిజనాపురం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు షేక్ మహమూద్ తెలిపారు.

సహారా ఎన్నికల్లో వెంకటాద్రి ప్యానల్ విజయం



విజయం సాధించిన వెంకటాద్రి ప్యానల్ అభ్యర్థులు, అధ్యక్షుడు సయ్యద్ జానీ

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సహారా స్టేట్ మెయింటనెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికల్లో వెంకటాద్రి ప్యానల్ విజయం సాధించింది. ఆదివారం ఉదయం పోలింగ్ జరుగగా సాయంత్రం ఎన్నికల అధికారులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎన్నికల కమిటీ సభ్యులు గంగదాసు కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, రాధాకృష్ణ ఓట్లను లెక్కించారు. మొత్తం 1002 ఓట్లకు 715 ఓట్లు పోలయ్యాయి. వెంకటాద్రి ప్యానల్ అధ్యక్ష అభ్యర్థి సయ్యద్ జానీకి 371 ఓట్లు రాగా, కరణం శ్రీకాంత్‌కు 339 ఓట్లు పోలయ్యాయి. 32 ఓట్ల అధిక్యతతో సయ్యద్ జానీని అధ్యక్షుడిగా ప్రకటించారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా వెంకటాద్రి ప్యానల్ అభ్యర్థులు శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా భీమ్లానాయక్, మంజుల, కోశాధికారిగా శేఖరయ్య గెలుపొందారు. కార్యవర్గ సభ్యులుగా శ్యాంప్రసాద్, జ్యోతి, తృప్తి అగర్వాల్, విజయలక్ష్మి, కవిత, జే.లత, వెంకటేశం, కృష్ణారెడ్డి, మంగమ్మ, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, రమా, అమరనాథ్, నర్సింహ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నిర్వాహకులు

లింగోజిగూడ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, బ్యాట్మింటన్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోల్‌లోని ఆర్3 స్టేడియంలో యూనిక్స్ సన్ రైజ్ రంగారెడ్డి జిల్లా బ్యాట్మింటన్ చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్‌రావు, బాబు, సాయిరెడ్డి, ఆనంద్, పామ ప్రభాకర్‌రెడ్డి, పీవీఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

90 వేల మంది కార్మికుల పిల్లలకు శిక్షణ

యాకుత్‌పురా: సెట్విన్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల మంది సంఘటిత, అసంఘటిత రంగానికి చెందిన కార్మికుల పిల్లలకు నైపుణ్యత కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్, తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సీఈఓ డాక్టర్ ఈ.గంగాధర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా ఆదివారం పురానీ హవేలీలోని సెట్విన్ సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో సెట్విన్ ఎండీ కే.వేణుగోపాల్ రావు జాతీయ జెండా ఎగరవేశారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో ఆయన సెట్విన్ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు.ఎంఏ మొహిజ్, సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, రాధాకృష్ణ, కోఆర్డినేటర్లు ఆసిఫ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సీఈఓ డాక్టర్ గంగాధర్, ఎండీ వేణుగోపాల్ రావు

మహిళ అదృశ్యం

లింగోజిగూడ: మహిళ అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు అరుణోదయనగర్ కాలనీలో నివాసం ఉండే పచ్చిమాండ్ల కృష్ణ డెవలప్‌మెంట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య స్మిత స్థానికంగా బ్యూటీ పార్లర్ నిర్వహిస్తుంది.ఈ నెల 1వ తేదీన వారిద్దరి మధ్య చిన్న గొడవ జరగడంతో మనస్తాపం చెంది స్మిత ఇంటి నుంచి బయటకు వెళ్లింది. 2 గంట ప్రాంతంలో ఇంటికి వచ్చిన కృష్ణ భార్య లేకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇండ్లలో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కిచన్నగారి లక్ష్మారెడ్డి, సామిడి గోపాల్‌రెడ్డి

మీర్‌పేట: రాష్ట్ర అవతరణ సందర్భంగా పీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మీర్‌పేట నందిహిల్స్‌లో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచన్నగారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సామిడి చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామానికి సాంస్కృతిక శోభ

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పేరణి, ఆంధ్రనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాగ్దేవి ఆర్ట్స్ అకాడమీ గురువులు పవన్, సంధ్య ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి

కాచిగూడ: యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసి ధార్మిక భావాలను పెంపొందించుకోవాలని ప్రముఖ సామాజికవేత్త లయన్ ఆకుల రవీందర్‌రావు అన్నారు. బాల భారతి శిక్షణ సమితి అధ్యక్షుడు కుంట రామకృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు నెలరోజుల పాటు వేదిక్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, యోగా, మెడిటేషన్, ప్రాణాయామ, సనాతనధర్మం తదితర అంశాల్లో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆదివారం ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వేదిక్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ధార్మిక భావనలు పెంపొందించేందుకు బాల భారతి శిక్షణ సమితి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యువత పాశ్చాత్య పోకడలకు బానిసలు కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు చిన్నతనం నుంచే అలవాటు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. దైవచింతన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. భగవద్గీత టీచర్ రేఖ, యోగా టీచర్ ప్రభావతి, నిర్వాహకులు వీరేష్‌గౌడ్, మధు, రామమూర్తి, భార్గవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.